GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

T MEDIA

మెయిన్ : శుక్రవారం-జనవరి 12-2024 పేజీలు : 3

## 31నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### ఫిబ్రవరి ఒకటిన ఓట్ ఆన్ అకౌంట్

**టి మీడియా, జనవరి 11,ఢిల్లీ :**

ఈనెల 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9వరకు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. తొలిరోజున ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించనున్నారు. అనంతరం ఆర్థిక సర్వేను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఓటాన్ అకౌంట్ బడ్జెట్ (మధ్యంతర బడ్జెట్)ను ప్రవేశపెట్టనున్నారు. ఈ మేరకు సమావేశ తేదీలను పార్లమెంట్



వ్యవహారాల కేబినెట్ సబ్ కమిటీ ఖరారు చేసింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రస్తుత ఎన్డీయే సర్కార్‌కు ఇదే చివరి బడ్జెట్ కానున్నది. బడ్జెట్ పై చర్చకు రెండు రోజులు కేటాయించారు.. చివరి రోజున బడ్జెట్ చర్చపై ప్రధాని ప్రసంగం ఉంటుంది..

## 21 మందితో.. వైసీపీ మూడో జాబితా విడుదల

**టి మీడియా, జనవరి 11,అమరావతి :**



వైసీపీ ఇంఛార్జిల మార్పులు చేర్పులకు సంబంధించి మూడో జాబితా ఎట్టకేలకు విడుదలైంది. 21మందితో (6 ఎంపీ స్థానాలు, 15 అసెంబ్లీ స్థానాలు) థర్డ్ లిస్ట్ ప్రకటించింది వైసీపీ హైకమాండ్. ఇప్పటివరకు 38 స్థానాల్లో ఇంఛార్జిల మార్పులు చేశారు జగన్. మొదటి విడతలో 11 స్థానాల్లో మార్పులు చేర్పులతో జాబితా రిలీజ్ చేశారు. రెండో విడతలో 27 స్థానాల్లో మార్పులు చేశారు జగన్. అయితే మొదటి జాబితాలో ఎక్కడా కూడా ఎంపీ స్థానాలు ప్రకటించ లేదు. రెండో జాబితాలో మాత్రం మూడు ఎంపీ స్థానాల్లో మార్పులు చేశారు. మూడో లిస్టులో 6 పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఈసారి అసెంబ్లీ స్థానాలతో పాటు పార్లమెంట్ స్థానాలకు ఇంఛార్జిలను ప్రకటించారు. మొదటి రెండు లిస్టులతో పోలిస్తే మూడో జాబితాకు సంబంధించి సీఎం జగన్ సుదీర్ఘ కసరత్తు చేశారు. వివాదాస్పదమైన నియోజకవర్గాలు ఉండటంతో ఎక్కువ సమయం తీసుకున్నారని తెలుస్తోంది.

### పార్లమెంటు ఇంఛార్జిలు

తిరుపతి.. కోనేటి ఆదిమూలం, కర్నూలు.. గుమ్మనూరు జయరామ్, ఏలూరు కారుమూరి సునీల్ కుమార్ శ్రీకాకుళం.. పెరాడ తిలక్,విశాఖ.. బొత్స ఝాన్సీ,విజయవాడ కేశినేని నాని, అసెంబ్లీ ఇంఛార్జిలు,ఇచ్చాపురం.. పిరియా విజయ, టెక్కలి.. దువ్వాడ శ్రీనివాస్, చింతలపూడి.. విజయ రాజు, చిత్తూరు.. విజయానంద రెడ్డి, మదనపల్లి.. నిస్సార్ అహ్మద్, రాయదుర్గం.. మెట్టు గోవింద రెడ్డి, దర్శి.. బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి,పూతలపట్టు.. సునీల్ కుమార్, కోడుమూరు.. డాక్టర్ సతీశ్, రాజంపేట.. అకేపాటి అమర్నాథ్ రెడ్డి, గూడూరు.. మెరుగు మురళి, సత్యవేడు..మద్దిల గురుమూర్తి పెనమలూరు జోగి రమేశ్, పెదన ఉప్పాల రాము, ఆలూరు విరూపాక్ష.

## టార్గెట్ 14...

# తెలంగాణ నేతలతో ఏఐసీసీ పెద్దల సమావేశం

**టి మీడియా, జనవరి 11, ఢిల్లీ:**

తెలంగాణలో విజయంతో ఊపుమీదున్న కాంగ్రెస్.. లోక్‌సభ ఎన్నికలపై కూడా దృష్టి సారించింది. రానున్న ఎన్నికల్లో వీలైనన్ని ఎక్కువ స్థానాల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ లోక్‌సభ సమన్వయ కర్తలతో ఢిల్లీలో కీలక భేటీ నిర్వహించింది అధిష్ఠానం. రానున్న ఎన్నికల్లో అమలు చేయాల్సిన వ్యూహాలు, ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు నేతలు. కాంగ్రెస్ పార్టీ ఇటీవలే తెలంగాణలోని 17 స్థానాలకు..14 మంది కోఆర్డినేటర్లను నియమించింది. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటికి శ్రీనివాసరెడ్డికి రెండేసి లోక్‌సభ నియోజకవర్గాల బాధ్యతలు అప్పగించారు. ఇందులో భాగంగా నేటి సమావేశంలో.. మిత్రపక్షాలతో సమన్వయం చేసుకోవడంపై అధిష్ఠానం నేతలకు దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. మొత్తం మీద టార్గెట్ 14 గా పెట్టినట్లు తెలుస్తోంది.. ఇదే వ్యూహంతో ముందుకు సాగాలని అధిష్టానం సూచించినట్లు సమాచారం..మరోవైపు రానున్న పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ నుండి 13 నుంచి 14 సీట్లు గెలవబోతున్నామన్నారు.. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. విజయమే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నట్టు చెప్పారు. ఇక రాహుల్ గాంధీని ప్రధాని





చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని నేతలంతా పనిచేస్తామన్నారు.. మరో మంత్రి సీతక్క, త్వరలో అభ్యర్థుల పేర్లు అధిష్ఠానానికి నివేదిస్తామని.. ఫిబ్రవరి లోపు ఎంపీ అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని చెప్పారు.

### ఏపీపై ఫోకస్..

ఇక దక్షిణాదిలో కర్నాటక , తెలంగాణ విజయంతో ఇప్పుడు ఏపీపై కూడా దృష్టి పెట్టింది..కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే వైఎస్ షర్మిలను పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీ..ఏపీలో ఆమెకు కీలక బాధ్యతలను అప్పగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మరోవైపు లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ పార్టీని బలోపేతం చేసే లక్ష్యంతో ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మాణిక్కం ఠాగూర్ రాష్ట్రంలో తొలిసారి పర్యటించారు. విజయవాడలో ఆయన పార్టీ ముఖ్య నేతలతో సమావేశమై రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. పార్టీలో కొత్త చేరికలపై దృష్టిసారించాలని నిర్ణయించారు. వైసీపీ, బీజేపీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నేతలకు సూచించారు మాణిక్కం ఠాగూర్. నేటి సమావేశంలో ఆయా అంశాలపై రాష్ట్ర నేతలకు హైకమాండ్ దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది.



## కాంగ్రెస్ అబద్దాల ముందు కెసిఆర్ అభివృద్ధి ఓడిపోయింది

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**టి మీడియా, జనవరి 11,హైదరాబాద్ :**

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ముందు కెసిఆర్ చేసిన అభివృద్ధి ఓడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ . పనుల మీద కంటే ప్రచారం మీద ఫోకస్ చేసి ఉంటే బీఆర్ఎస్ గెలిచేదని అన్నారు. తెలంగాణ భవన్ లో నేడు జరిగిన మహబూబాద్ పార్లమెంట్ నియోజకర్గ సన్నాహక సమావేశంలో మాట్లాడుతూ. వందలాది సంక్షేమ కార్యక్రమాలు మన ప్రభుత్వ హయాంలో అమలు చేసినా, ఏనాడు కూడా ప్రజలను లైన్లలో నిలబెట్టలేదని స్పష్టం చేశారు. ప్రజల సౌకర్యమే చూసామే కానీ రాజకీయ ప్రయోజనం, రాజకీయ ప్రచారమే గురించి ఏనాడు ఆలోచించలేదని అన్నారు. ప్రజలు బీఆర్ఎస్ ను పూర్తిగా తిరస్కరించలేదని అన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి మూడో వంతు సీట్లు 39 వచ్చాయి. 14 స్థానాల్లో ఓటమి కేవలం గరిష్టంగా 6 వేల ఓట్ల తోనే జరిగింది. మొత్తంగా కాంగ్రెస్ మనకు తేడా కేవలం 1.85 శాతం అన్నారు. పార్టీ సమావేశాలను వరుసగా పెట్టుకుంటామని అన్నారు. అనుబంధ సంఘాలను బలోపేతం చేస్తామని తెలిపారు. పార్టీకి అన్ని వర్గాలను దగ్గరయ్యేలా కార్యక్రమాలు చేపడతామని అన్నారు. గిరిజనులకు స్థానిక సంస్థల రిజర్వేషన్ తో పాటు.. పోడు భూముల పట్టాల పంపిణీ, అనేక ఇతర సంక్షేమ పథకాలు అనేక కార్యక్రమాలను మన ప్రభుత్వం గతంలో అందించిందన్నారు. అయినా గిరిజనం ఎక్కువ ఉన్న చోట్లకూడా ప్రజలు పూర్తి మద్దతు మనకివ్వలేదని అంటూ ఇలాంటి వాటన్నింటి సమీక్ష చేసుకుని ముందుకుపోతామన్నారు.

**కాంగ్రెస్ లో ఎవరికి వారే యమునా తీరే :కడియం**

ఇక మహబూబాబాద్ లోకసభ నియోజకవర్గ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి , ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ లో ఎవరికి వారే యమునా తీరే అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ 420 హామీలు నెరవేర్చే పరిస్థితి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ ,హరీష్ రావు లు కృష్ణార్జునులు వారు కలిసికట్టుగా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కోరారు. కార్యకర్తలకు అగ్రనాయకత్వం అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు,, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి , మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్, ఎంపి కవిత మాలోత్ , మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, మాజీ చైర్మన్లు, మేయర్లు, మాజీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, మాజీ మున్సిపల్ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, జిల్లా పార్టీ అధ్యక్షులు, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ భేటీ

- **కలసి పని చేయాలని నిర్ణయం**

**టి మీడియా, జనవరి 11,హైదరాబాద్:**

తెలంగాణ రాష్ట్రంలో అధికార బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి.. పాలనలో దూసుకుపోతున్నారు. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులే లక్ష్యంగా వివిధ కంపెనీలకు చెందిన ప్రముఖులతో సమావేశమవుతున్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సీఎం నివాసంలో ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ గూగుల్ గ్రూప్ వైఎస్ చైర్మన్ తమ ప్రతినిధులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు.గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట గురువారం సీఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని



మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులపై గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట సీఎంతో చర్చించి ప్రభుత్వంతో కలిసి పనిచేయండనికి సంసిద్ధతను వ్యక్తం చేశారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుందని, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం వంటి అంశాలలో తెలంగాణ కోసం డిజిటలైజేషన్ ఎజెండాను అభివృద్ధి చేయడంలో భాగస్వాములు అవుతామన్నారు. అలాగే తెలంగాణ పౌరుల అవసరాలను తీర్చడానికి నాణ్యమైన సేవలను అందించడానికి లోతైన సాంకేతికత, నైపుణ్యం తమతో ఉందని చంద్రశేఖర్ ముఖ్యమంత్రికి వివరించారు. గూగుల్ మ్యాప్స్, గూగుల్ ఎర్త్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించి సాధ్యమయ్యే రహదారి భద్రత మెరుగుదలలపై కూడా ముఖ్యమంత్రి చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్

**టి మీడియా, జనవరి 11,హైదరాబాద్:**




తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ స్థానాలకు తాజాగా నోటిఫికేషన్ విడుదల అయ్యింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్‌ను అసెంబ్లీ కార్యాలయం విడుదల చేసింది. కాగా, రెండు సీట్లకూ విడివిడిగానే ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అసెంబ్లీ కార్యాలయం వేర్వేరుగానే నోటిఫికేషన్లను జారీ చేసింది. నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని అందులో పేర్కొంది. ఈనెల 18 వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. 19న నామినేషన్ల పరిశీలన, 22 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఈనెల 29న పోలింగ్ జరగనుంది. అదే రోజున ఫలితాలు వెలువడనున్నాయి.అయితే, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పాడి కౌశిక్ రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. దీంతో వారు తమ ఎమ్మెల్సీ పదవులకు రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో రెండు స్థానాలకు ఎన్నికల కమిషన్ ఉపఎన్నికలు నిర్వహిస్తున్నది. అయితే రెండు స్థానాలకు వేర్వేరుగా ఎన్నికలు నిర్వహిస్తుండటంతో సంఖ్యాబలం దృష్ట్యా అధికార కాంగ్రెస్ పార్టీకే ఆ సీట్లు దక్కనున్నాయి.

## జమిలి ఎన్నికలకు మేము వ్యతిరేకం

- **న్యాయశాఖ సెక్రటరీకి బెంగాల్ సీఎం**

**టి మీడియా, జనవరి 11,ఢిల్లీ :**

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే దేశం.. ఒకే ఎన్నిక అంటే నియంతృత్వమే అని మమత విమర్శించారు. దీనిని తమ పార్టీ వ్యతిరేకిస్తునట్టు కేంద్ర న్యాయశాఖ కార్యదర్శికి రాసిన లేఖలో దీదీ పేర్కొన్నారు. ఇది ఫెడరల్ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు. జమిలి ఎన్నికలపై ఇప్పటికే కేంద్రం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలతో, సంస్థలతో చర్చలు జరుపుతోంది. ఈ నేపథ్యంలోనే తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ ఒకే దేశం ఒకే ఎన్నికను అంగీకరించడం లేదని మరోసారి స్పష్టం చేశారు. న్యాయశాఖ కార్యదర్శికి లేఖ రాసి తన నిరసనను తెలియజేశారు. మమత తన లేఖలో, 'ప్రస్తుత పరిస్థితుల్లో రూపొందించిన ఒకే దేశం, ఒకే ఎన్నికలు అనే భావనతో ఏకీభవించనందుకు చింతిస్తున్నాను. మీ ప్రతిపాదన, సూత్రీకరణతో మేము అంగీకరించము. మీ లేఖలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ కాన్సెప్ట్ స్పష్టంగా లేదు అంటూ లేఖలో పేర్కొన్నారు. నిజానికి, కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం 'ఒక దేశం-ఒకే ఎన్నికల'కు సంబంధించి ఒక కమిటీని వేసింది. ఎనిమిది మంది సభ్యులతో కూడిన ఈ కమిటీకి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వం వహిస్తున్నారు. కాగా కమిటీ సభ్యులుగా అమిత్ షా, అధిర్ రంజన్ చౌదరి, గులాం నబీ ఆజాద్, ఎన్‌కే సింగ్, సుభాష్ కశ్యప్, హరీష్ సాల్వే, సంజయ్ కొఠారీలను నియమించారు. అయితే, కమిటీలో భాగం కావడానికి నిరాకరిస్తూ లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరి హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ కమిటీకి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



రాష్ట్రపతిగా ఏకకాల ఎన్నికలకు మద్దతుగా నిలిచారు. 2018 జనవరి 29న పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి కోవింద్ మాట్లాడుతూ, దేశంలోని పాలనా స్థితితో సతమతమవుతున్న పౌరులు, భారతదేశంలోని ఏదో ఒక ప్రాంతంలో తరచూ ఎన్నికలు జరుగుతాయని, ఇది ఆర్థిక వ్యవస్థకు, అభివృద్ధికి ప్రతికూలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తరచూ ఎన్నికలు జరగడం వల్ల మానవ వనరులపై పెనుభారం పడటమే కాకుండా మోడల్ ప్రవర్తనా నియమావళిని అమలు చేయడం వల్ల అభివృద్ధి ప్రక్రియకు ఆటంకం ఏర్పడుతుంది. అందువల్ల, ఏకకాల ఎన్నికల అంశంపై నిరంతరం చర్చ జరగాల్సిన అవసరం ఉంది. అన్ని రాజకీయ పార్టీలు ఇందులో నిమగ్నమై ఉండాలి అంటూ రామ్‌నాథ్ కోవింద్ పిలుపునిచ్చారు.

**1967 వరకు ఏకకాలంలో ఎన్నికలు**

స్వతంత్ర భారతదేశంలో, 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' గురించి చాలా కాలంగా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వాల్లోనూ దీనిపై చర్చ జరిగింది. అయితే, ఈ విషయం కొన్ని నివేదికలు మొదలైన వాటికి మించి ఎప్పుడూ ముందుకు సాగలేదు. ఇంకొంచెం వెనక్కి వెళితే, భారతదేశంలో 1967 వరకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే ధోరణి ఉండేదన్నది కూడా వాస్తవం. కానీ 1968, 1969లో కొన్ని శాసనసభలు, 1970 డిసెంబరులో లోక్‌సభ రద్దు అయిన తర్వాత విడివిడిగా ఎన్నికలు జరుగాయి. అయితే, 1983లో ఎన్నికల సంఘం వార్షిక నివేదికలో మళ్లీ ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం కల్పించింది. ఆ తర్వాత ప్రభుత్వాలు జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. తాజాగా మరోసారి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల ప్రస్తావనను ముందుకు తీసుకువ్చింది.

## సీఎం రేవంత్ రెడ్డితో అమెరికా అధ్యపక బృందం భేటీ

**టి మీడియా,జనవరి 11, హైద్రాబాద్**

:ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో వారి నివాసంలో హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం భేటిఅమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం డాక్టర్ డొమినిక్ మావో నేతృత్వంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారిని వారి నివాసంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఉస్మానియా యూనివర్సిటీలో జనవరి 7వ తేది నుండి నిర్వహిస్తున్న ప్రోగ్రాం ఫర్ సైంటిఫికల్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పీఎస్ఐఎల్-24) కార్యక్రమం గురించి సిఎంకు బృంద సభ్యులు వివరించారు. పేద విద్యార్థుల కోసం రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల బలోపేతం, సుసంపన్నం చేయడానికి ఏడాదిపాటు విద్యా కార్యక్రమాలను నిర్వహించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించాలని హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందాన్ని సిఎం కోరారు.



జనవరి 7వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఉస్మానియా యూనివర్సిటీలో తెలంగాణ పాఠశాల విద్యాశాఖ సహకారంతో హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యాపకుల బృందం 40 ప్రభుత్వ పాఠశాలల్లోని 100 మంది 10 నుంచి 12వ తరగతి విద్యార్థులకు, 33 జిల్లాల నుండి ఉన్నత పాఠశాలల ఆంగ్ల ఉపాధ్యాయులకు 5 రోజులపాటు సైంటిఫికల్లీ ఇన్‌స్పైర్డ్ లీడర్‌షిప్ (పీఎస్ఐఎల్-24) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని అధ్యాపకులు ముఖ్యమంత్రికి వివరించారు. విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ బుర్రా వెంకటేశం ఈ కార్యక్రమం వివరాలను ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్, విద్యాశాఖ కమిషనర్ శ్రీమతి దేవసేన, ఎంఎస్ షెఫాలీ ప్రకాష్, డాక్టర్ ఎండీ రైట్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయడమే నా జీవిత కాల కోరిక

- **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**టి మీడియా, జనవరి 11,సత్తుపల్లి :**

తనకు ఉన్న రాజకీయ కోరిక సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయటమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలోసీతారామ ప్రాజెక్ట్ పనులపై ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.అనంతరం తుమ్మల మాట్లాడుతూ.. గోదావరి జలాలు 10లక్షల ఎకరాలు ఇచ్చేందుకు తలపెట్టినది సీతారామ ప్రాజెక్ట్ అన్నారు. ఇప్పటికే 7 వేలకోట్లకు పైగా ఖర్చు జరిగిందన్నారు. టన్నెల్ రెండు వైపుల నుండి పనులు చేసి పూర్తి చేయాలన్నారు. టెక్నాలజీని ఉపయోగించి పనులు పూర్తి చేస్తున్నారని తెలిపారు. యాతలకుంట టన్నెల్ పూర్తి అయితే బెత్తుపల్లి, లంకా సాగర్ కు నీళ్లు అందుతాయన్నారు. గండుగల పల్లిలో నాలుగో పంప్ హౌస్ పనులు జరుగుతున్నాయని తెలిపారు.యాతాల కుంట టన్నెల్ ప్రధానమైందని అన్నారు. నిత్య పర్యవేక్షణతో అధికారులు పనులు



పూర్తి చేయాలన్నారు. సత్తుపల్లి నియోజక వర్గానికి సీతారామ ప్రాజెక్ట్ లో ప్రధానమైంది యాతాల కుంట టన్నెల్ అని తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు కోరారు. తనకు ఉన్న రాజకీయ కోరిక సీతారామ ప్రాజెక్ట్ పూర్తి చేయటమే అని అన్నారు. ఉభయ జిల్లాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పనులకు ఆటంకం కలగకుండా చూస్తానని తెలిపారు. సీతారామ ప్రాజెక్ట్ జిల్లా ప్రజల ఆశ..ఆకాంక్ష అన్నారు.

## కారుకు షాక్ 21 మంది కౌన్సిలర్లు రాజీనామా

**టి మీడియా, జనవరి 11,బెల్లంపల్లి:**




మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పుర రాజకీయం మలుపు తిరిగింది. 21 మంది కౌన్సిలర్లు భారాస కు మూకుమ్మడిగా రాజీనామాలు చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. 19 మంది సంతకాలు చేసి పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు రాజీనామా లేఖను పంపారు. సంతకాలు చేయనప్పటికీ వైస్ ఛైర్మన్ సుదర్శన్‌తో పాటు 14వ వార్డు కౌన్సిలర్ బొడ్డు నారాయణ సైతం రాజీనామాకు అంగీకరించినట్లు సమాచారం

### అవిశ్వాస బలపరీక్ష అంతలోనే రాజీనామాలు

బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఛైర్మన్ రేపు అవిశ్వాస పరీక్ష ఎదుర్కొనున్నారు.. ఈ నేపథ్యంలోనే వారం క్రితం భారాసకు చెందిన 18 మంది కౌన్సిలర్లు అజ్ఞాత శిబిరానికి తరలి వెళ్లారు. అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారంతా రాజీనామా నిర్ణయానికి వచ్చారు. శుక్రవారం అవిశ్వాస తీర్మానంపై సమావేశం జరగాల్సి ఉంది. బెల్లంపల్లిలో మొత్తం 34 వార్డులు ఉన్నాయి. వీటిలో ఒక వార్డు కౌన్సిలర్ గతంలో మృతి చెందారు. ప్రస్తుతం కాంగ్రెస్‌కు 11 మంది, భాజపాకు ఒకరు మద్దతు ఇస్తున్నారు. భారాసకు చెందిన 21 మంది రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

## హిందూ మతానికి విరుద్ధంగా రాముడి ప్రతిష్ట

- శంకరాచార్య మఠాధిపతుల ప్రకటన

**టి మీడియా, జనవరి 11,హరిద్వార్:**



అయోధ్యలో జనవరి 22న జరుగనున్న రామాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమానికినలుగురు శంకరాచార్యులు హాజరుకావడం లేదని ఉత్తరాఖండ్‌లోని జ్యోతిర్ మఠానికి చెందిన 46వ శంకరాచార్య అయిన అవిముక్తేశ్వరానంద సరస్వతి తెలిపారు. ఆలయ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, అయోధ్యలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ శాస్త్రాలకు వ్యతిరేకంగా ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగుతున్నదని ఆరోపించారు. సనాతన ధర్మం నిబంధనలు ఉల్లంఘిస్తున్నందున అతి ముఖ్యమైన హిందూ మత గురువులు ఈ మహోత్సవానికి హాజరుకావడం లేదని హరిద్వార్‌లో ఆయన మీడియాతో అన్నారు. ఆలయ నిర్మాణం పూర్తి చేయకుండా రాముడి విగ్రహాలను ప్రతిష్ఠించడం హిందూ మతానికి విరుద్ధమని విమర్శించారు. ప్రతిష్ఠాపనకు అంత తొందర అవసరం లేదన్నారు. రామమందిర నిర్మాణం పూర్తైన తర్వాత విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. మరోవైపు ఆలయ ట్రస్ట్ ప్రకారం రామాలయంలో మొదటి అంతస్తు, గర్భగుడి మాత్రమే సిద్ధంగా ఉంది. వచ్చే రెండేళ్లలో ఆలయాన్ని పూర్తి స్థాయిలో నిర్మిస్తామని ట్రస్ట్ తెలిపింది. ఈ నేపథ్యంలో పూరీ గోవర్ధన్ పీఠానికి చెందిన శంకరాచార్య స్వామి నిశ్చలానంద సరస్వతి కూడా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి హాజరుకావడం లేదని ఇటీవల తెలిపారు. హిందూ మతం నిబంధనలు, గ్రంథాలకు విరుద్ధంగా ఈ కార్యక్రమం జరుగుతున్నదని ఆరోపించారు. స్కంద పురాణం ప్రకారం కర్మలు సక్రమంగా నిర్వహించకపోతే విగ్రహంలోకి చెడు శకునాలు ప్రవేశించవచ్చని ఆయన అన్నారు.

## తెలంగాణ భవన్‌లో జేబుదొంగల చేతివాటం

- ఎమ్మెల్యే జేబులో నుంచి రూ.20 వేలు మాయం

**టి మీడియా, జనవరి 11,హైదరాబాద్**




తెలంగాణ భవన్‌లో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ జేబులో నుంచి రూ.20 వేలు మాయమయ్యాయి. మరో నేత పర్స్‌ను కూడా కొట్టేశారు జేబు దొంగలు. ఓ నేతకు చెందిన సెల్ ఫోన్ చోరీకి గురైంది.బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సమీక్ష సమావేశాలు జరుగుతున్నాయి. పలు జిల్లాల నాయకులు ఇందులో పాల్గొంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు దీటుగా బీఆర్ఎస్ నుంచి అభ్యర్థులను నిలబెట్టేందుకు బీఆర్ఎస్ ప్రణాళికలు వేసుకుంటోంది.రెండు రోజుల క్రితమే ఖమ్మం లోక్‌సభ సమీక్ష సమావేశం జరిగింది. ఇవాళ మహబూబాద్ పార్లమెంట్ నియోజకర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఇందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని నేతలకు దిశానిర్దేశం చేశారు.దీంతో తెలంగాణ భవన్ వద్దకు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ నేతలు వస్తున్నారు. ఈ సమయంలోనే జేబుదొంగలు ప్రవేశించి తమ బుద్ధిని ప్రదర్శిస్తున్నారు. రద్దీ, హడావిడి ఉండే ప్రాంతాలను టార్గెట్‌గా చేసుకుని జేబుదొంగలు రెచ్చిపోతున్న ఘటనలు ఇటీవలే ఇతర ప్రాంతాల్లోనూ చోటుచేసుకుంటున్నాయి.

## సర్పంచ్, ఉప సర్పంచ్ లను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

**టీ మీడియా, జనవరి 11, పెద్దపల్లి:**



జిల్లా సబ్బితం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ లను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి గురువారంతెలిపారు. వివరాలకు వెళ్తే సబ్బితం గ్రామ నివాసి కందుల అశోక్ చేసిన ఫిర్యాదుపై మండల పంచాయతీ అధికారి విచారణ జరిపి సమర్పించిన నివేదిక ఆధారంగా పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామ సర్పంచ్ సి. హెచ్. సదయ్య, ఉప సర్పంచ్ మాదాసి శ్రీనివాస్ లు గ్రామ పంచాయతీ నిధులు 2 లక్షల 2 వేల 210 రూపాయలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించి తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 37 (5 ) ప్రకారం సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని, అలాగే అప్పటి జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బి. సతీష్, కె.శ్రీనివాస్ లకు ఛార్జ్ మెమోలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

## విద్యార్థులకు దుప్పట్లు గిఫ్ట్ ప్యాకెట్లు పంపిణి

- హాజరైన ఏ ఎస్పి

**టీ మీడియా, జనవరి11, ములుగు బ్యూరో :**




ములుగు జిల్లా లో గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ, ఖమ్మం వారు ఏటూరునాగరం మండలంలోని రోయ్యూరు, సంకరజు పల్లి , రాంపూర్, ముల్లకట్ట, ఇప్పలగుడెం, అంబేత్కర్ నగర్ గ్రామాలలోనీ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరు పేద విద్యార్థిని విద్యార్థులకు, దుప్పట్లు, జంతికలు, పేస్ట్ లు, బ్రష్ లు, సబ్బులు, పెన్నులు, తినుబండారాలు, గిఫ్ట్ ప్యాకెట్స్ లను ఏటూరునగారం ఎస్పి సంకీర్తన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ పేద పిల్లలకు సహాయం చేయడానికి ముందుకొచ్చిన స్వచ్ఛంద సంస్థకి కృతజ్ఞతలు తెలియజేశారు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కొరకు ప్రోత్సహిస్తున్నటువంటి గ్రేస్ సర్వీస్ సొసైటీ ఎంతోమంది విద్యార్థులకు చేయూతనిస్తోందనీ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ఏటూరు నాగారం ఇంచార్జ్ కంతి ముత్తయ్య, ముర్రం రాజేష్, కంతి లక్ష్మణ రావు, పోరిసెట్టి అది శివ,నరాల కిరణ్ కుమార్ పాఠశాల ఉపాధ్యాయులు సోలం సత్యం తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రికల్ సైకిల్స్ ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**టీ మీడియా,జనవరి 11, గోదావరిఖని :**




గాంధీ నగర్ లోని రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం చండీయాగం పూజ కార్యక్రమం ముగిసిన అనంతరం నలుగురికి వికలాంగులకు ఎలక్ట్రికల్ సైకిల్స్ ను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ మాట్లాడుతూ... రామగుండం నియోజకవర్గం లోని ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.రానున్న రోజుల్లో ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని తెలిపారు.సంక్రాంతి పండుగను ప్రజలు కుటుంబ సమేతంగా సంతోషంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు 10 లక్షల ఆరోగ్య శ్రీ ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ప్రజా పాలన తీసుకువచ్చి ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి ముందుకు వెళ్తామన్నారు.అంతే కాకుండా నిరుపేద లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సమితిగా బీఆర్ఎస్

- మార్చాలని గులాబీ బాస్‌కు విజ్ఞప్తులు

**టి మీడియా, జనవరి 11,హైదరాబాద్:**




2022 నవంబర్‌లో అప్పటివరకు తెలంగాణ రాష్ట్ర సమితిగా ఉన్న పార్టీని భారత రాష్ట్ర సమితిగా మార్చారు అధినేత కేసీఆర్. పేరు మార్చిన ఆ సమయంలోనే దీనిపై కార్యకర్తల్లో విభిన్న వాదనలు వినిపించాయి. ప్రజల్లో కూడా సెంటిమెంట్‌కు పార్టీ దూరమవుతుందని అభిప్రాయం వ్యక్తం అయింది. అయినప్పటికీ పార్టీ అధిష్ఠానం మాత్రం మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఢిల్లీ ఇలాంటి రాష్ట్రాల్లో పార్టీని విస్తరించాలని వ్యూహాత్మకంగా నిర్ణయం తీసుకుంది.తెలంగాణ రాష్ట్ర సమితి అని ఉంటే మిగతా రాష్ట్రాల్లో ఎంట్రీ అసాధ్యమని భావించిన అధినేత అందుకు అనుకూలంగా భారత్ పేరును పార్టీకి జోడించారు. 2022 -23 సంవత్సరాల్లో మహారాష్ట్రలో బహిరంగ సభలు ఏర్పాటు చేసి నాందేడ్, నాగపూర్, సోలాపూర్ ప్రాంతాల్లో పార్టీ కార్యాలయాలు కూడా ప్రారంభించారు. ఇక దేశ రాజధాని ఢిల్లీలోనూ పార్టీకి కేంద్ర కార్యాలయాన్ని నిర్మించారు.ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైంది భారత రాష్ట్ర సమితి. గత వారం రోజులుగా పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గాల వారిగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటమిపై పోస్టుమార్టం చేయడంతో పాటు వచ్చే ఎన్నికలపై ఫోకస్ పెట్టేలా సమావేశాలు జరుగుతున్నాయి. అయితే ఇందులో మెజారిటీ కార్యకర్తలు పార్టీ పేరు మార్చడం ద్వారానే ఇబ్బందులు తలెత్తయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఏకంగా మాజీ మంత్రులు కేటీ రావు, హరీష్ రావుల ముందే కార్యకర్తలతో పాటు స్థానిక నేతలు మళ్లీ తెలంగాణ రాష్ట్ర సమితిగా పార్టీ పేరు మారుస్తే సక్సెస్ అవుతామని బహిరంగంగానే చెప్పుకొచ్చారు. పార్టీలో తెలంగాణ పదం తీసివేయడంతో సెంటిమెంట్‌కు దూరమయ్యామని ప్రజలు కూడా అదే భావిస్తున్నారని చాలామంది విశ్లేషించారు.

## వైఎస్ షర్మిలకు పీసీసీ పదవి బూడిదలో పోసిన పన్నీరు

- మాజీ ఎంపీ హర్షకుమార్

**టి మీడియా, జనవరి 11,అమరావతి:**



అంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ దూకుడు పెంచింది. రాష్ట్ర విభజన పుణ్యమా అని 2014, 2019లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ఇక 2024 ఎన్నికల్లో సత్తా చాటాలని స్పెషల్ ఫోకస్ పెట్టింది. కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సాధించిన విజయంతో కాంగ్రెస్ మరింత ఉత్సాహం పని చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఏపీలో సైతం పాగా వేయాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన పక్కా ప్రణాళికలు రూపొందిస్తోంది.ఇందులో భాగంగా మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి కూతురు వైఎస్ షర్మిలను ఇప్పటికే కాంగ్రెస్‌లోకి ఆహ్వానించింది. షర్మిలకు కీలక బాధ్యతలు అప్పగించే యోచనలో ఆ పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ నేతల్లో కొత్త అసంతృప్తి వెలుగు చూస్తుంది. ఈ క్రమంలో సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ ఎంపీ హర్షకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వైఎస్ షర్మిలకు ఏపీ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించవద్దని హైకమాండ్‌ను కోరారు హర్షకుమార్. షర్మిలకు పీసీసీ చీఫ్ ఇస్తే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. కావాలంటే వైఎస్ షర్మిలకు జాతీయ స్థాయిలో పదవి ఇచ్చుకోండి అంటూ ఉచిత సలహా ఇచ్చారు హర్షకుమార్.ఇంతకాలం తెలంగాణ బిడ్డ అని చెప్పుకుని తిరిగిన షర్మిళ.. ఆంధ్రప్రదేశ్‌లో ఎలా చెల్లుబాటు అవుతుందని హర్షకుమార్ ప్రశ్నించారు. ప్రస్తుత ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఆయన చెల్లెలు షర్మిల ఇద్దరు ఒకటేనని ఎద్దేవా చేశారు. పెళ్లి కార్డు ఇచ్చేందుకు వెళ్లి అరగంటసేపు మంతనాలు జరపాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వైఎస్ జగన్ ఏమో ప్రధాని మోదీ వెనుక వెళ్తుంటే, వైఎస్ షర్మిల మాత్రం కాంగ్రెస్ నేత సోనియా గాంధీ వెనుక వెళ్తున్నారన్నారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా, తాము సేఫ్‌గా ఉండాలనేది జగన్, షర్మిల ఉద్దేశమని మండిపడ్డారు హర్ష కుమార్.

## కాంగ్రెస్‌కు చిక్కిన మంచిర్యాల మున్సిపాలిటీ

**టి మీడియా, జనవరి 11,మంచిర్యాల :**




మున్సిపాలిటీని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీ హస్తగతం చేసుకుంది. బీఆర్ఎస్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్ లపై కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఇవాళ ఓటింగ్ నిర్వహించారు.. అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన 26మంది కౌన్సిలర్స్, బీజేపీకి చెందిన ఒక కౌన్సిలర్ పాల్గొన్నారు.మొత్తం 27 మంది కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటువేశారు. దీంతో మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్ పార్టీకే దక్కాయి. కాగా అవిశ్వాస తీర్మానంలో తమకు మెజారిటీ లేదని.. తీర్మానానికి ముందే బీఆర్ఎస్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేష్ గౌడ్ రాజీనామా చేశారు. ఇది ఇలా ఉంటే అవిశ్వాస తీర్మాన నివేదికను స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో రాములు మంచిర్యాల జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ కు అందజేశారు.

## అసభ్యకరమైన కంటెంట్‌పై యూట్యూబ్ కు సమన్లు

**టి మీడియా, జనవరి 11,ఢిల్లీ :**




తల్లులు మరియు కొడుకులకు సంబంధించిన అసభ్యకరమైన కంటెంట్‌పై నేషనల్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ యూట్యూబ్ అధికారికి సమన్లు పంపింది. అపెక్స్ చైల్డ్ రైట్స్ బాడీ ఎన్.సి.పి.సి.ఆర్ తల్లులు మరియు కొడుకులకు సంబంధించిన అసభ్యకర చర్యలను చిత్రీకరించినందుకు యూట్యూబ్ అధికారులు వచ్చే వారం కలవాలని బుధవారం సమన్లు జారీ చేసింది. అటువంటి కంటెంట్‌ని అప్లోడ్ చేస్తున్నా అన్ని ఛానెల్‌ల జాబితాతో పాటు భౌతికంగా హాజరు కావాలని యూట్యూబ్ ప్రభుత్వ మరియు పబ్లిక్ పాలసీ అధిపతికి పంపిన నోటీసులో పేర్కొంది. యూట్యూబ్ ఛానెల్‌లలో తల్లులు మరియు కొడుకులకు సంబంధించిన అసభ్యకర చర్యలను ఛానెల్‌లు చిత్రీకరిస్తున్నాయని ఇది ఆందోళనకరమైన ధోరణి అని బాలల హక్కుల సంఘం పేర్కొంది. "ఇది పిల్లల శ్రేయస్సు మరియు భద్రతపై హాని కలిగించే గురించి, తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతుంది. ఇంకా, ఈ వీడియోలకు మైనర్‌లతో సహా వీక్షకుల సంఖ్య ఉంది, ఇది ముఖ్యమైన ఆందోళనలను కూడా లేవనెత్తుతుంది" అని ఎన్.సి.పి.సి.ఆర్ తెలిపింది.

## వందలాది మంది ఉద్యోగులకు గూగుల్ ఉద్వాసన

**టి మీడియా, జనవరి 11, ఢిల్లీ :**





గూగుల్ మరోసారి వందలాది మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకనుంది. గూగుల్ కంపెనీలో డిజిటల్ అసిస్టెంట్, హార్డ్‌వేర్, ఇంజనీరింగ్ టీమ్‌లలో పనిచేస్తున్న వందలాది మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. కేవలం ఖర్చులను తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నట్లు గూగుల్ వెల్లడించింది. 2023 ద్వితీయార్థంలో మా కంపెనీకి చెందిన అనేక బృందాలు సమర్థవంతంగా పనిచేయడానికి మార్పులు జరిగాయి. ఈరకమైన మార్పుల్లో భాగంగానే ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. అని గూగుల్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. అయితే తొలగించిన ఉద్యోగులు గూగుల్‌లోనే వేరేచోట ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని కంపెనీ తెలిపింది. అయితే ఉద్యోగులను తొలగించడాన్ని ఆల్ఫాబెట్ వర్కర్స్ యూనియన్ (ఎడబ్ల్యుయు) విమర్శించింది. అలాగే గూగుల్ కంపెనీ ఉద్యోగులను తొలగించడంపై సహోద్యోగులు మండిపడుతున్నారు. 'మా వినియోగదారుల కోసం గొప్ప ఉత్పత్తులను రూపొందించడానికి మా సభ్యులు, సహచరులు ప్రతిరోజూ కష్టపడతారు. అయితే ప్రతి త్రైమాసికంలో బిలియన్లు ఆర్జిస్తున్నప్పుడు కంపెనీ మా సహోద్యోగులను తొలగించడం కొనసాగించదు. కంపెనీలో మా ఉద్యోగాలు సురక్షితంగా ఉండే వరకు మేము పోరాటం ఆపము' అని గూగుల్ కంపెనీ గ్రూప్ మెంబర్స్ తెలిపారు.

## దేవాలయాలను టార్గెట్ గా పెట్టుకున్న దొంగల ముఠా

- గూడెం గ్రామంలోని రామాలయంలో చోరీ
- సీత దేవి పుస్తెలు దొంగలించిన దొంగల ముఠా

**టీ మీడియా జనవరి 11 చిన్నంబావి:**



మండలం లోని గూడెం గ్రామం లోని రామాలయం లో పట్ట పగలే చోరీ జరిగింది.గర్భ గుడి తాళం పగలగొట్టి సీత దేవి విగ్రహం మేడల వున్న బంగారు పుస్తెలు లను ఎత్తుకెళ్లారు.సాయంత్రం గుడి లో పూజ చేయడానికి పూజారి వెళ్తే గర్భ గుడి తెరుచుకొని వుండటం గమనించిన పూజారి లోపలికి వెళ్ళి చూడగా సీత దేవి పుస్తెలు కనిపించకపోవడం తో పూజారి గ్రామ ప్రజలకు,సర్పంచ్,కు విషయం తెలియజేయగ గ్రామ సర్పంచ్ చక్రవర్తి,స్థానిక పోలీస్ లకు సమాచారం ఇవ్వగ పోలీస్ లు వచ్చి విచారణ జరిపారు.దాదాపు డెబ్బై వేల రూపాయల విలువగల బంగారం పుస్తెలు ఎతుకెల్లునట్లు పోలీసులు తెలిపారు.నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీస్ లు తెలిపారు.మండలం లోని వివిధ గ్రామాల లోని దేవాలయాలలో చోరీ జరగడం తో గ్రామాలలో దొంగల భయం ఎక్కువ కావడం తో మండల ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు.

## ఇంటింటికి అయోధ్య అక్షింతలు పంపిణీ

**టి మీడియా, జనవరి 11,మేళ్ళ చెరువు:**



సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు మండలం, కందిబండ గ్రామంలో గురువారం అయోధ్య రామమందిరం నుండి వచ్చిన పవిత్ర అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. అయోధ్యలో నిర్మించినటువంటి రామ మందిరంలో జనవరి 22న రాములవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పురస్కరించుకుని అయోధ్య రామమందిరం నుండి రాములవారి పవిత్ర అక్షింతలు కందిబండ గ్రామానికి తీసుకొని రావడం జరిగింది. అయోధ్య రామమందిరం నుండి వచ్చిన శ్రీ రాములవారి పవిత్ర అక్షింతలను కందిబండ గ్రామంలో శ్రీ రామ భక్తుల ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కందిబండ శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వందేభారత్‌లో భోజనం దుర్వాసన..

- ప్రయాణికుడికి వింత అనుభవం

**టి మీడియా, జనవరి 11, హైదరాబాద్ :**



ఢిల్లీ నుంచి వారణాసికి వందేభారత్ రైలులో వెళ్తున్న ఆకాశ్ కేసరి అనే ప్రయాణికుడికి వింత అనుభవం ఎదురైంది. రైల్వేసిబ్బంది తీసుకొచ్చిన భోజనం నాసిరకంగా ఉండటమే కాకుండా, దుర్వాసన వచ్చింది. తీవ్ర అసహనానికి గురైన అతడు వెంటనే వీడియో తీసి.. సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇండియన్ రైల్వేస్, వందేభారత్ ఎక్స్‌ప్రెస్, రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ అధికారిక 'ఎక్స్' ఖాతాలను కూడా ట్యాగ్ చేశారు. భోజనం సరిగా లేనందుకు ఆ మొత్తాన్ని తిరిగి చెల్లించాలని (రిఫండ్) కోరారు. ఇది సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో, 'రైల్వే సేవ' విభాగం స్పందించింది. రైల్ మదద్ పోర్టల్‌లో అధికారికంగా ఫిర్యాదును నమోదు చేసినట్లు చెబుతూ.. ఆ ఐడీ నెంబర్‌ను కూడా 'ఎక్స్'లో పోస్టు చేసింది. అంతేకాకుండా పీఎన్ఆర్ నెంబర్, మొబైల్ నెంబర్‌ను ఎస్ఎంఎస్ ద్వారా తమకు అందించాలని కోరింది. ఈ పోస్టుపై ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ కూడా స్పందించింది. అసౌకర్యానికి చింతిస్తున్నామని, సంబంధిత సర్వీస్ ప్రొవైడర్‌పై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.




## టీ మీడియా 2024 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ

- క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఆర్కెపి ఎస్సై రాజశేఖర్

**టీ మీడియా, జనవరి 11, రామకృష్ణాపూర్**

డిజిటల్ మీడియా రంగంలో రాణిస్తున్న టీ మీడియా 2024 సంవత్సరం క్యాలెండర్ ను గురువారం రామకృష్ణాపూర్ ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ టీ మీడియా ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ ప్రజలకు ఎప్పటికప్పుడు వార్తలను అందిస్తూ, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు చేరవేయడంలో అగ్రభాగాన ఉండాలని మరింత ఆదరణ పొందాలని రామకృష్ణాపూర్ ఎస్సై ఆకాంక్షించారు.ఎప్పటికప్పుడు వార్తల సేకరణ లో ముందున్న టీ మీడియా ప్రత్యేకతను చాటుకుందన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, సీనియర్ పాత్రికేయ మిత్రులు పి. గట్టయ్య, గంగారపు గౌతమ్ కుమార్ పాల్గొన్నారు.



## జూపల్లి ఆధ్వర్యంలో టీ మీడియా క్యాలెండర్ ఆవిష్కరణ

**టీ మీడియా ,జనవరి 11,అశ్వరావుపేట :**

నియోజవర్గ కేంద్రమైన అశ్వారావుపేటలో శ్రీ శ్రీనివాస కేబుల్ నెట్వర్క్ ఆఫీస్ నందు జిల్లా కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ ఆధ్వర్యంలో టీ మీడియా క్యాలెండర్ ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులకు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఈ సమాజంలో మీడియా దే ప్రముఖ పాత్ర అని పాత్రికేయ వృత్తి ఎంతో బాధ్యతాయుతమైనది అని కాంగ్రెస్ ప్రభుత్వంలో పాత్రికేయుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చేందుకు తమ వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. డిజిటల్ యుగంలో టీ మీడియా అనతి కాలంలోనే వార్తలు అందీయటంలో ప్రజల మన్ననలు చురుగున్నదని అన్నారు. ఈ సందర్భంగా టీ మీడియా కుటుంబానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లెల రామ లక్ష్మయ్య, బొడ్డు సత్యనారాయణ,రామినేని సత్యనారాయణ, అల్లాడి వెంకట రామారావు,మువ్వ రవి, తానికొండ సత్యనారాయణ, శంకర్ గుర్రాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## ఇంటింటికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు

**టీ మీడియా, జనవరి 11, రామకృష్ణాపూర్:**

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో అయోధ్య రామ మందిరం నుండి వచ్చిన అక్షింతలను గురువారం శ్రీ కోదండ రామాలయం నుండి శివాజీ నగర్ లోని ఇంటింటికి తిరుగుతూ జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ కోలాటాలతో,భక్తి శ్రద్ధలతో అక్షింతలను అందరికీ పంచడం జరిగింది.అక్షింతలను స్వీకరించినందుకు భక్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో శివాజీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అప్పుడు వైసీపీ.. ఇప్పుడు టీడీపీ, జనసేన

- ముద్రగడ చుట్టూ తిరుగుతున్న పార్టీలు
- అప్పుడు వైసీపీ.. ఇప్పుడు టీడీపీ, జనసేన
- ముద్రగడ చుట్టూ తిరుగుతున్న పార్టీలు

**టి మీడియా, జనవరి 11, గోదావరి :**
జిల్లా రాజకీయాలు కాపు నేత ముద్రగడ పద్మనాభం చుట్టూ తిరుగుతున్నాయి. టీడీపీ, జనసేన పొత్తు ఖరారు కావడంతో.. కాపులను తమ వైపు తిప్పుకోవడం కోసం ముద్రగడను పార్టీలో చేర్చుకునేందుకు అధికార వైసీపీ ప్రయత్నించింది. ముద్రగడ కూడా కుమారుడితో కలిసి వైసీపీలో చేరేందుకు సిద్ధమయ్యారనే వార్తలు వచ్చాయి. తాజాగా ముద్రగడ ముద్రగడను తమ వైపు తిప్పుకునేందుకు జనసేన రంగంలోకి దిగడం గోదావరి జిల్లాల్లో సరికొత్త రాజకీయ పరిణామాలకు తెరలేపింది. ముద్రగడ



జనసేనలో చేరితే.. ఉభయ గోదావరి జిల్లాల్లో టీడీపీ, జనసేన కూటమికి తిరుగుండదనే నమ్మకంతో ఉన్నారు ఇరు పార్టీల నేతలు. ఈ క్రమంలో పలువురు జనసేన నేతలు ఆయనతో కలిసి చర్చలు జరిపారు. అయితే, పవన్ కల్యాణ్ ఇచ్చిన లేఖను ముద్రగడకు అందించామని జనసేన నేతలు తెలిపారు. జనసేనతో పాటు టీడీపీ నేతలు కూడా కిర్లంపూడిలో ముద్రగడను కలిశారు.. టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ ముద్రగడను కలిశారు. ఆయన మళ్లీ రాజకీయాల్లో వస్తే ఆహ్వానిస్తామని అన్నారు. రాజకీయంగా తన కోసం మాత్రమే వచ్చానని, టీడీపీ అధిష్టానం తనకు చెప్పలేదని నెహ్రూ చెప్పారు. ఇది తన వ్యక్తిగతం మాత్రమే అని పార్టీకి సంబంధించిన విషయం కాదంటూ పేర్కొన్నారు. అయితే, ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తానని ముద్రగడ చెప్పలేదని తెలిపారు. తనను కలిసేందుకు వచ్చిన వాళ్లందరినీ ఆప్యాయంగా పలకరిస్తున్న ముద్రగడ పద్మనాభం.. తన మనసులో ఏముందనే విషయాన్ని మాత్రం బయటపెట్టడం లేదు. దీంతో ఆయన రాజకీయంగా ఎవరివైపు నిలుస్తారనే అంశంపై సస్పెన్స్ కొనసాగుతోంది. అయితే సంక్రాంతి తరువాత దీనిపై క్లారిటీ వస్తుందని తెలుస్తోంది.



## నివాళులర్పించిన మాజీ మంత్రి

- డాక్టర్ జి చిన్నారెడ్డి

**టీ మీడియా, జనవరి11, పెబ్బేరు:**
మండలం గుమ్మడం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బందేల శ్రీనివాసులు అన్న వెంకటస్వామి ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ జి చిన్నారెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పిస్తూ వారి కుటుంబానికి ఎల్లవేళల అండగా ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ , మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి జి మణ్యం, పాతపల్లి సర్పంచ్ రవీందర్ నాయుడు, ఎస్టీ సెల్ అధ్యక్షులు రాజు నాయక్,మాజీ సర్పంచ్ నరేందర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనంద్ సాగర్,సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీ కాంత్,స్థానిక నాయకులు హరిబాబు కృష్ణయ్య, దిలీప్ యాదవ్, నరసింహ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**
ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోని బస్టాండులో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య నాయకులు జెడ్పిటిసి సామాన్య నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, సింగల్ విండో వైస్ చైర్మన్ కామరాజు, బిజెపి నాయకులు బుచ్చిబాబు గౌడ్, జన్నుమధు వివిధ కుల సంఘాల నాయకులు వివిధ గ్రామాల వడ్డెరలు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షులు దాసర్ల భూమయ్య మాట్లాడుతూ వడ్డే ఓపన్న మొట్టమొదటి స్వతంత్ర సమరయోధుడు అని ఈయన రేనాటి ప్రాంతంలో ఆంగ్లేయులపై యుద్ధం చేశాడని ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కి సైన్యాధ్యక్షుడిగా కుడి భుజంగా ఉండి ఆంగ్లేయులకు నిద్రలేని రాత్రులు చేశారు. వీరు 1840 నుండి 1846 బండి వరకు వీరు ఆంగ్లయులపై రేనాటి ప్రాంతంలో పోరాటం చేశారు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లెపు ఆంజనేయులు, నర్సింహ, లోకయ్య, ఆంజనేయులు, శ్రీరాములు, శాంతియ్య, సత్యనారాయణ, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధానికి ఘన నివాళులు

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**
భారతదేశ మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి 58వ వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కౌన్సిలర్లు నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం భారతదేశ రెండవ మాజీ ప్రధాని అయిన లాల్ బహుదూర్ శాస్త్రి చేసిన సేవలను వారు జ్ఞాపకం చేసుకున్నారు. 1904 అక్టోబర్ 02 వ తేదీన జన్మించిన ఆయన 1947లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. భారత మొదటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూ గారి తర్వాత భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన ఆయన కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం ఎనలేని సేవలను అందించి 1966 జనవరి 11వ తేదీన పరమపదించారు. ఈ సందర్భంగా వారు ఆయన సేవలను కొని ఆడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కౌన్సిలర్లు వెంకటేష్ చీర్ల సత్యం, మధుసూదన్ గౌడ్ సీనియర్ నాయకులు లక్కాకుల సతీష్, షఫీ, చుక్క రాజు, బీరం రాజశేఖర్ రెడ్డి శంకరయ్య, యువకులు కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి తెలుగుదేశంపార్టీ చేయూత

**టీ.మీడియా,జనవరి11,చింతూరు:**
అల్లూరి సీతారామ జిల్లా చింతూరు మండలం పేగ గ్రామంలో బుదవారం రాత్రి మడకం. పెంటయ్య ఇల్లు దగ్ధం అయింది. ఆ కుటుంబానికి చింతూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, కూరగాయలు పంపిణీ చేశారు . ఈ కార్యక్రమంలో చింతూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇల్ల చిన్నారెడ్డి తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి శీలంతమ్మయ్య, మండల సీనియర్ నాయకులు పొదిలి రామారావు, యూత్ నాయకులు కుంజ బాలకృష్ణ ,పేగ సీనియర్ నాయకులు సరియం బ్రహ్మయ్య ,బూత్ ఇంచార్జి సోడే శ్రీను, యూత్ నాయకులు సరియం.రవీంద్ర ,బూత్ తునికి సత్యం తదితరులు పాల్గొన్నారు.




## రైతుబంధు విషయంలో రైతులతో పరిహాసమా

- మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, జనవరి 11, వనపర్తి బ్యూరో :**
రైతుల ధాన్య కొనుగోలు డబ్బులు 1000 కోట్లు, 500 బోనస్ కలిపి చెల్లించాలి.రైతుబందు విషయములో రైతులలో పరిహాసమా? రెండు లక్షల ఋణమాఫీ ఏమైంది. గురువారం తెలంగాణ భవన్ నందు నిర్వహించిన పత్రికా సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ పలు రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ధాన్య కొనుగోలు బకాయి 1000 కోట్ల రూపాయలు 500బోనస్ కలిపి రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులు ఎవ్వరు కూడా ధాన్యాన్ని అమ్ముకోవద్దు మేము వచ్చిన వెంటనే క్వింటాలుకు 500 రుపాయల బోనస్ కలిపి కొనుగోలు చేస్తామని మాట ఇచ్చి రైతుల ధాన్యన్ని కొనుగోలు చేయకపోగా బకాయి ఉన్న 1000 కోట్లు కూడా ఇవ్వలేదని దీనితో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తోంది అని అన్నారు.రైతుబంధు పట్ల పరిహాసమా మేము వస్తే 15000రూపాయల రైతుబంధు ఇస్తామన్న మాటలు నీటి ముటలేనా అని అన్నారు. ముఖ్యమంత్రి రైతు బంధు ఇప్పటికే ఇచ్చామని అంటారు. ఉప ముఖ్యమంత్రి రైతు బంధు విషయములో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది అంటారు. వ్యవసాయ మంత్రి మాత్రము పండగ తర్వాత రైతు బంధు ఇస్తాం అంటారు. స్పష్టత లేని ప్రకటనలు ఇచ్చి రైతులను గందరగోళ పరిస్థితిలోకి నెట్టారని దుయ్యబట్టారు.

**ఋణ మాఫీ నీటి ముటలెనా..**
డిసెంబర్ 9తారీఖు నాటికి ప్రతి రైతుకు 2లక్షల ఋణ మాఫీ జరుగుతుందని చెప్పిన ప్రభుత్వ పెద్దలు దాన్ని గాలికి వదిలేశారు అని అన్నారు. 24గంటల కరెంటుతో కృష్ణా బేసిన్ క్రింద వున్న రైతులకు యాసంగికి సాగునీరు ఇస్తారా లేదా తేల్చి చెప్పాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి. వరంగల్, ఖమ్మం జిల్లాలో మిర్చి దేశములో నంబర్ వన్ అని అట్టి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి అని అన్నారు.




## గాయత్రి విద్యానికేతన్ లో ముందస్తు సంక్రాంతి సంబరాలు

**టీ మీడియా, జనవరి 11, పెద్దపల్లి:**
పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్ లో విద్యార్థినులకు ముందస్తు సంక్రాంతి వేడుకలలో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల ఆకృతులలో వేసిన రంగవల్లులు అందరినీ ఆకర్షించాయి. ముఖ్యంగా చిన్నారులు వేసిన ముగ్గులు, ఒక అమ్మాయి, బంధాలను గూర్చి తెలిపే సందేశాత్మక ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రకరకాల బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువుని పిల్లలు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం బాలురకు గాలిపటాల పోటీ నిర్వహించగా, అందరూ ఆనందంతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పలువురు విద్యార్థులు హరిదాసు వేషధారణలో రావడం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం భోగి మంటలు వేసి, వాటి చుట్టూ పిల్లలు, టీచర్లు అందరూ చేరి ఆనందంతో నృత్యం చేశారు. గాయత్రి విద్యా నికేతన్ కరస్పాండెంట్ రజనీ దేవి కూడా వారితో పాటు నృత్యం చేస్తూ వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ పిల్లలు వేసిన వివిధ ముగ్గులను, బొమ్మల కొలువుని ఆసక్తిగా పరిశీలించారు. అనంతరం కరస్పాండెంట్ అల్లెంకి రజనీ దేవి మాట్లాడుతూ సంక్రాంతి పండగ అనేది కష్టపడి పండించిన పంట ఇళ్లకి చేరే సమయం. ధాన్యలక్ష్మికి స్వాగతం చెప్పేందుకు ఇంటి ముందు అందమైన రంగవల్లులు దర్శనమిస్తాయి. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్దవాళ్ళ వరకు ముగ్గుల్లో గొబ్బెమ్మలను పెట్టి పూలతో అలంకరించి పాటలు పాడతారని అన్నారు. ఈ పండగ అందరి జీవితాల్లో నూతన కాంతులు తేవాలని ఆకాంక్షిస్తూ అందరికీ ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, నవీన్, స్రవంతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## జెడ్పీ చైర్మన్ అవిశ్వాసానికి చెక్

- మాట్లాడిన మాజీ మంత్రి
- చైర్మన్ తో సహా ఐదుగురు హాజరు

**టీ మీడియా, జనవరి 11, పెద్దపల్లి:**
జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ పై అవిశ్వాసం పెట్టే ప్రయత్నాలకు చెక్ పడింది. విషయాన్ని సీరియస్ గా తీసుకున్న అధిష్టానం మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ ను రంగంలోకి దింపగా గురువారం మాజీ మంత్రి తన నివాసంలో అందుబాటులో ఉన్న జెడ్పీటీసీలను పిలిచి మాట్లాడారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మదూకర్ తో పాటు ఓదెల జెడ్పీటీసీ గంట రాములు, ధర్మారం జెడ్పీటీసీ పూస్కూరి పద్మజ జితేందర్ రావ్, మంథని జెడ్పీటీసీ తగరం సుమలత శంకర్ లాల్, అంతర్గామ్ జెడ్పీటీసీ ఆముల నారాయణ లు హాజరయ్యారు. తమకు అవిశ్వాసం పెట్టే ఆలోచన లేదని, పార్టీ పేరు చెప్పి తమను తప్పుదోవ పట్టిస్తున్నారని వారు తెలిపారు. మిగతా జెడ్పీటీసీ లను మాజీ మంత్రి ఫోన్ లో సంప్రదించగా ఫోన్ లైన్ లో అందుబాటులోకి వచ్చిన ముగ్గురు జెడ్పీటీసీలు సైతం తాము అవిశ్వాసం కు వెళ్ళమని తాము అందుబాటులో లేమని రేపు వచ్చి కలుస్తామని తెలిపారు. పెద్దపల్లి జెడ్పీ లో 13 జెడ్పీ స్తానాలుండగా అవిశ్వాసానికి 9 మంది జెడ్పీటీసీలు అవసరం. కాగా పుట్ట మధు వెంట ఇప్పటికే ఐదుగురు జెడ్పీటీసీలు ఉండటంతో ఇక అవిశ్వాసానికి అవకాశం లేదు.దానికి తోడు మిగతా జెడ్పీటీసీలు సైతం పార్టీ ఆదేశం మేరకు కట్టుబడి ఉండే అవకాశం ఉండగా, అవిశ్వాసానికి సారథ్యం వహిస్తున్న జెడ్పీటీసీయే తనకేం తెలియదని బుకాయిస్తూ పార్టీ ఆదేశం మేరకు కట్టుబడి ఉంటా అని సన్నిహితులతో పేర్కొంటుండంతో అవిశ్వాసానికి చెక్ పడింది.



## టీ మీడియా క్యాలెండర్ ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారే

**టీ మీడియా , జనవరి 11,అశ్వరావుపేట:**
నియోజవర్గంలోని దమ్మపేట మండలం గండుగలపల్లి గ్రామంలో తమ నివాసం నందు గురువారం నియోజవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ టీ మీడియా క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ మీడియాలో అనతికాలంలోనే మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించిందని వార్త కథనాల విషయంలో చాలా వేగంగా ప్రజలకు వార్తలు అందిస్తుందని మీడియాలో తనకంటూ ప్రత్యేకత స్థానాన్ని సంపాదించుకుందని ఉన్నారు. ఈ సందర్భంగా టీ మీడియా కుటుంబానికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను అని అన్నారు. ఆయనతో పాటు నియోజవర్గ రిపోర్టర్ కేశిబోయిన వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## స్మార్ట్ కిడ్జ్ లో ఘనంగా సంక్రాంతి సంబురాలు

**టి మీడియా, జనవరి :11, ఖమ్మం :**
స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబురాలు ఆనందోత్సవాలతో నిర్వహించారు. పంచె కట్టు, సాంప్రదాయ చీరకట్టులో పాఠశాల చిన్నారులు ఈ వేడుకల్లో నూతన శోభను సంతరించుకున్నారు. విద్యార్థులంతా భోగిమంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి, బొమ్మల కొలువు పెట్టారు. పాఠశాల ప్రాంగణమంతా అందమైన రంగవల్లులతో ముస్తాబు చేసి డు... డు.. బసవన్నలా ఆటా పాటా, హరిదాసుల కీర్తనలు, కోడిపందాల జోరు, గాలిపటాల సందడి , గొబ్బెమ్మ పాటలతో వేడుకలు హోరెత్తాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని మూడు రోజులపాటు భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలుగా జరుపుకుంటున్నామన్నారు. మన తెలుగు సాంప్రదాయాలను ముందు తరాలకు అందించడానికి ఈ సంక్రాంతి పర్వదిన వేడుకలు ఉత్సాహంగా ఊరూరా జరుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య , పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఆకట్టుకున్న బొమ్మల కొలువు**
సంక్రాంతి సంబరాల్లో పాఠశాల చిన్నారులు ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. వివిధ రకాల బొమ్మలను చిన్నారులు ఈ వేడుకల్లో పెట్టి సరదాగా గడిపారు. రంగురంగుల వివిధ వెరైటీ బొమ్మలు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ బొమ్మలు, చెక్క బొమ్మలు, మట్టితో తయారుచేసిన బొమ్మలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ బొమ్మలకొలువు పాఠశాల చిన్నారుల సృజనాత్మకతకు అద్దం పట్టింది. బొమ్మల కొలువులో పాల్గొన్న విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య , పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



## ముగ్గుల పోటీలు నిర్వహించిన ఎంపిపి

**టి మీడియా, జనవరి 11.మేళ్ళ చెరువు రూరల్:**
సూర్యాపేట జిల్లామేళ్లచెరువు మండలం రామాపురం జెడ్పీ హైస్కూల్ నందు సంక్రాతి పండగ సందర్బంగా విద్యార్థులని చే ఏర్పాటు ముగ్గులు పోటీలను ప్రారంభ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా ఎంపిపి పద్మా సైదేశ్వరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**టీ మీడియా, జనవరి 11, జన్నారం:**
మండల కేంద్రంలో బుధవారం రోజున పోనకల్ పట్టణ మున్నూరు కాపు సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్, కన్వీనర్ పుదారి సత్యనారాయణ, మండల వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, పట్టణ గౌరవ అధ్యక్షులు కస్తూరి భూమన్న, ఉపాధ్యక్షులు అనుముల శ్రీనివాస్, బొడ్డు రామన్న, ఎమ్మిడి శెట్టి సుధాకర్, ప్రధాన కార్యదర్శి లెక్కల మల్లయ్య, కోశాధికారి పుదారి నరసయ్య, కార్యదర్శులు అప్పల జలపతి, ప్రచార కార్యదర్శి దాసరి రాజన్న, సభ్యులు అన్నం నరసయ్య, ఆకుల ఆనంద్ ,సేపతే బుచ్చిబాబు, పురుషోత్తం, కుల సభ్యులు ,తదితరులు పాల్గొన్నారు